క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష

సైదాపురం: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డివి జనల్ అభివృద్ధి అధికారిణి, మండల ప్రత్యేక అధికారి డి.వసుమతి తెలిపారు. ఆమె శుక్రవా రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎంపీడీవో శివకుమార్‌తో కలిసి చీకవోలు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ గ్రామసభను పరిశీలించారు.

వాచ్‌మన్‌పై దాడి

కోట: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వాచ్‌మన్ కోటయ్యపై శుక్రవారం కొందరు ఆకతాయిలు దాడి చేసి గాయపరిచారు. పాఠశాల ప్రాంగణంలో తిరుగుతూ అరుస్తున్న ఇద్దరిని అక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో వారు వాచ్‌మన్‌తో గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పీఎం ఫసల్ బీమాతో అనేక ప్రయోజనాలు

ఓజిలి: పీఎం ఫసల్ బీమా యోజన పథకంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఏవో విజయలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం ఓజిలి ఆర్బీకేలో రైతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 31 లోపు వరి పంటకు రూ.630లు, ఇతర పంటలకు 15వ తేదీ లోపు రూ.650 ప్రీమియం చెల్లించాలన్నారు. విపత్తుల్లో పంట నష్టం సంభవిస్తే పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ పీ సురేష్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

వాకాడు : ఎక్సైజ్ అధికారులు శుక్రవారం వాకాడు, చిట్టమూరు మండలాల్లోని బెల్టు షాపులపై దాడులు చేశారు. చిట్టమూరు మండలం యల్లసిరికి చెందిన ఎ.వెంకటరమణయ్యను అరెస్టు చేసి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

చెంచమ్మను దర్శించుకున్న మంత్రి ఆనం

దక్కిలి : మండలంలోని ఆముదూరు పంచాయతీలోని వెలుగొండలు కింద వెలసిన విష్ణుమూర్తి సమేత చెంచులక్ష్మీ అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

కాశీపురంలో ముగ్గుల పోటీలు

వాకాడు : మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సందర్భంగా మండలంలోని కాశీపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ నేత వి.రవిశేఖర్‌రెడ్డి దాతృత్వంతో బహుమతులు అందజేశారు. సర్పంచి మమత, హెచ్‌ఎం భ్రమర, ఉపాధ్యాయుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన కష్టం

రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి వరి పంట సాగు చేశారు. భారీ వర్షాలకు చెరువులు, కాలువలు, నదులు పొంగి పొర్లాయి. దీంతో వరినారు మడుల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. వారం రోజులుగా నీరు అలాగే ఉండడంతో వరినాట్లు కుళ్లిపోతున్నాయి. దీంతో పెట్టుబడి పూర్తిగా నీటిపాలైందని, తమ గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వారం రోజులుగా నీటిలోనే వరిపైరు
- నారు కుళ్లిపోతుందని రైతుల ఆవేదన


నీట మునిగిన వరిపైర్లు


చిల్లకూరు చెరువు కలుజు గుండా ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు


దిగువ పొలాల మీదుగా ప్రవహిస్తున్న కలుజు కాలువ వరద నీరు

పెళ్లకూరు : మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌కు రైతులు సిద్ధమయ్యారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో కొందరు రైతులు ముందుగా వరి నారు పోసుకుని పొలాలను దుక్కి చేసుకున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు చిల్లకూరు పెద్ద చెరువు నిండడంతో రైతులు కలుజును పూర్తిగా మూసివేసి వరినాట్లు పూర్తి చేసుకున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో మళ్లీ భారీ వర్షాలు కురవడంతో చెరువు సామర్థ్యానికి మించి నీరు చేరింది. ఎగువ ప్రాంతంలో ఉన్న పెళ్లకూరుకు చెందిన పలువురు రైతుల పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. పెళ్లకూరు దళితకాలనీలోకి వరదనీరు చేరింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి బుధవారం కాలనీలో పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం చిల్లకూరు చెరువు కలుజుకు అడ్డుగా ఉన్న మట్టి బస్తాలను తొలగించారు. దాంతో చెరువు దిగువ ప్రాంతంలోని పంట పొలాలన్నీ నీట మునిపోయాయి. సుమారు 200 ఎకరాలకు పైగా వరిపైర్లు పూర్తిగా వరద నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

పట్టించుకునేవారు లేరు



71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పొలాల్లోకి వెళ్లే కాలువలు, తూములకు అడ్డంగా గ్రావెల్, మట్టి వేశారు. దీంతో వరద నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేక వరి పైర్లను ముంచేశాయి. పెళ్లకూరు, జీలపాటూరు, దొడ్లవారిమిట్ట, కొత్తూరు తదితర రోడ్లకు ఇరువైపులా ఉన్న పంట పొలాలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. ఇక్కడి సమస్యలను పట్టించుకునేవారు లేరు.
– రమణారెడ్డి, మాజీ సర్పంచ్, పెళ్లకూరు

పూర్తిగా నష్ట పోయాము



చిల్లకూరు పెద్ద చెరువు కింద లోతట్టు వ్యవసాయ పొలాల్లో వరినాట్లు వేసి ఎరువులు కూడా వేసుకున్నాము. భారీ వర్షాలకు చెరువు సామర్థ్యానికి మించి నీరు చేరింది. కలుజు ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం అధికం కావడంతో వందల ఎకరాల్లో వరిపైర్లు మునిగిపోయాయి. దీంతో పెట్టుబడులన్నీ నీటిపాలయ్యాయి. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.
– విజయభాస్కర్, రైతు చిల్లకూరు

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


నాయిడుపేట టౌన్ : బీఆర్ అంబేడ్కర్‌కు వైఎస్సార్ సీపీ నేతల నివాళి


చిల్లకూరు : ఏరూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న దళిత ఉద్యోగులు

దొరవారిసత్రం : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దళిత నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. మాజీ సర్పంచులు జకరయ్య, కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ ఉదయ్, కేవీ కిష్టయ్య, శంకరయ్య, అశోక్, రాజా, కిషోర్ పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం కానూరులో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలువాయిలో..

కలువాయి: బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలువాయి బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నిజమాల ప్రసాద్, తుమ్మల నాగేశ్వరరావు, రేవూరి శ్రీ నివాసులు, సోకా సురేష్, దొరబాబు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుస్తామని దళిత ఉద్యోగులు, నాయకులు తెలిపారు. మండలంలోని చిల్లకూరు, ఏరూరు, చింతవరం, అంకుపాటూరు, తమ్మినపట్నం గ్రామాల్లో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఓడూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ సిబ్బంది అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గోను రఘుబాబు, రామచంద్రయ్య, కావలి బాలయ్య, ఏడుకొండలు, గోను జయరామయ్య, అంకయ్య, నెలిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్, సూపరింటెండెంట్ అనూరాధ పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రముఖ న్యాయవాది నరేంద్ర తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవా రం భూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. నేతలు డక్కిలి సిద్దయ్య, సుధాకర్, డక్కిలి సుబ్బరామయ్య, నారి సురేష్, హనుమంతు పాల్గొన్నారు. బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నరేష్, టీచర్లు పారికృష్ణయ్య ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నా రు. విద్యార్థులు గీసిన సుమారు 500 పైగా అంబేడ్కర్ చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గురు ప్రసన్న, బుజ్జమ్మ, చంద్రిక, సుమాలిని పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక పిలుపునిచ్చారు. నాయుడుపేటలో శుక్రవా రం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాదని రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మీ, నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, ఒట్టూరు కిషోర్ యాదవ్, గంధవళ్లి సిద్దయ్య, చదలవాడ కుమార్, పాద ర్తి హరినాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, దారా రవి, మహిళా రాష్ట్ర కార్యదర్శి ఈదా రత్నశ్రీ, షేక్ షబ్బీర్, షేక్ రహంతుల్లా పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక


అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఉమారాణి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ-ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా 5 ప్రముఖ బహుళ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. 55 మంది నిరుద్యోగులు హాజరు కాగా 30 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి రామారావు, ఈఎస్సీ కోఆర్డినేటర్ హరికృష్ణ, సునీల్, సిడాప్ సిబ్బంది దేశయ్య, పెంచల్ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధువరులతో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, సత్యనారాయణ రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కాళహస్తి భవాన్ అనుదీప్, సుజాన్ నిఖితా వివాహం జరిగింది. నూతన వధూవరులను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ, నాయకులు కలికి మాధవరెడ్డి, గంధవళ్లి సిద్దయ్య, పాదర్తి హరినాథ్‌రెడ్డి, దార రవి, పాలేటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిలో దూకిన మహిళ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖిలో శుక్రవారం రాత్రి మహిళ దూకింది. పోలీసుల కథనం మేరకు.. భారీ వర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గుర్తుతెలియని మహిళ శుక్రవారం రాత్రి కాజ్‌వేపై నిలుచుని నీటి ప్రవాహం చూస్తోంది. ఉన్నట్టుండి నదిలోకి దూకేసింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారి శ్యామ్‌బాబు, సీఐ బాబి సిబ్బందితో అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రజక సంఘం నాయకులు చిందేటి వెంకటేశ్వర్లు లైఫ్ జాకెట్ ధరించి నదిలో గాలింపు చేపట్టారు. రాత్రి చీకటిగా ఉండడంతో వెతకడాన్ని నిలిపివేశారు. శనివారం ఉదయం నదీ పరివాహక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడతామని అగ్నిమాపక శాఖ అధికారి వెల్లడించారు. మహిళ వివరాల కోసం పోలీసులు చుట్టు పక్కల ప్రాంతాల వారిని విచారిస్తున్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



వాకాడు : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఆర్పీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఎంఈవో నసీం అలీ, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఐఈఆర్టీలు జగన్‌మోహన్‌రావు, సునీత పాల్గొన్నారు.

పిల్లలకు బహుమతులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి, సహిత విద్య జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఎంఈవోలు శాంతి, మునిరత్నం, భవిత ఐఈఆర్టీలు నేతాజీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రొవిజనల్ షాపుల్లో మద్యం అమ్మకాలు


చావలి చెక్‌పోస్టు వద్ద ఓ ప్రొవిజన్ షాపులో మద్యం విక్రయాలు

పెళ్లకూరు: ఊరు...వాడా తేడా లేకుండా ప్రొవిజనల్ షాపులు, టీ అంగళ్లల్లోనూ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు హెచ్చరికలు చేస్తున్నా కూటమి నేతల అండతో ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటుచేసి జోరుగా విక్రయాలు చేస్తున్నారు. మండలంలోని 24 పంచాయతీలుండగా పెళ్లకూరు, చెంబేడు గ్రామాల్లో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు, నిరుపేదలు అధికంగా ఉండడంతో కూటమి నాయకులు ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆటోల్లో బహిరంగంగా మద్యం సరఫరా చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. దొడ్లవారిమిట్ట, చావలి చెక్ పోస్టు, తాళ్వాయిపాడు, కానూరు, చిల్లకూరు, పాలచ్చూరు, పుల్లూరు తదితర గ్రామాల్లో బెల్టు షాపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వాటిలో అధిక రేట్లకు మద్య విక్రయిస్తున్న విషయాన్ని కొందరు యువకులు రహస్యంగా సెల్ ఫోన్లలో వీడియోలు తీశారు. వారిపై సంబంధిత బెల్టు షాపు నిర్వాహకులు దాడులు చేశారు.

రెవెన్యూ గ్రామసభలకు కరువైన స్పందన


బాలాయపల్లి: అర్జీలు అందజేస్తున్న మహిళలు


సూళ్లూరుపేట: ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో కిరణ్మయి యాదవ్

పెళ్లకూరు/సైదాపురం/దొరవారిసత్రం/కలువాయి/చిల్లకూరు/ఓజిలి/కోట/రాపూరు/బాలాయపల్లి(సైదాపురం): : గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభించారు. వీటికి రైతుల నుంచి స్పందన కరువైంది. అధికారులు అవగాహన కల్పించకపోవడంతో రైతులు పెద్ద సంఖ్యలో రావడం లేదు. కొన్ని గ్రామాల్లో రెండు, మూడు అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించిన అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- పెళ్లకూరు మండలం పాలచ్చూరులో జరిగిన రెవెన్యూ గ్రామసభలో నాలుగు అర్జీలు వచ్చాయి. పాలచ్చూరు సర్వే నంబరు 196/1లో 1.14 ఎకరాల భూమిని 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నప్పటికీ వన్‌బీ, అడంగల్ ఇవ్వడం లేదని రైతు వీరరాఘవులు వాపోయాడు. అలాగే సర్వే నంబరు 272/2లో ఎకరా పట్టా భూమిని ఆన్‌లైన్‌లో ఇనాం భూమిగా నమోదు చేశారని దొడ్డగ సతీష్ వినతి పత్రం అందజేశాడు. తన ఆధీనంలో ఉన్న 1.78 ఎకరాల భూమిని రెగ్యులర్ ఖాతాలోకి మార్చాలని అరణి సుమతి విన్నవించింది. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్ఐ సంతోషిణిబాయి, వీఆర్వోలు రమేష్, వంశీ, సర్వేయర్లు సూర్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
- సైదాపురం మండలం చీకవోలులో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 25 అర్జీలు వచ్చినట్టు డీటీ అనూరాధ తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.
- దొరవారిసత్రం మండలం నెలబల్లి రెవెన్యూ గ్రామసభలో పాస్ పుస్తకాలు, సర్వే పనులు, ఇంటి స్థలాల కోసం 20కిపైగా అర్జీలు అందినట్లు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్ రాయల్, సర్వేయర్ నాగరాజు, ఎండోమెంట్ అధికారి మూర్తి, రాధకృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- కలువాయి పొలాలు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు తోపుగుంట రైతులు వాపోయారు. తోపుగుంటలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దారు శ్యామ్ సుందర్‌రాజు మాట్లాడుతూ ఈ గ్రామం రీ సర్వేకు నోటిఫై అయిందని, డ్రోన్ సర్వే పూర్తయినా ఫీల్డ్ సర్వే జరగలేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో సర్వే నంబరుకు బదులు ఎల్‌పీఎం నంబరు కనిపిస్తున్నందున రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. డీటీ మంజుల, టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.
- డక్కిలి మండలంలోని నాగవోలులో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఇంటి స్థలాలు, భూముల సర్వే, రేషన్‌కార్డులు తదితరాలకు 17 అర్జీలు అందజేసినట్టు తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర నాయుడు, టీడీపీ అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ రాజగోపాల్ పాల్గొన్నారు.
- చిల్లకూరు మండలంలోని ఓడూరులో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 34 అర్జీలు, రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం 11 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్వేయర్ మల్లికార్జున్, ఆర్ఐ పూర్ణచంద్, వీఆర్వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.
- సూళ్లూరుపేట భూ వివాదాలు, రికార్డులు తారుమారు తదితర సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో కిరణ్మయి యాదవ్ తెలిపారు. మన్నారుపోలూరు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది రైతులు అర్జీలు ఇచ్చారు.
- ఓజిలిలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ పద్మావతి మాట్లాడు తూ వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయ్ కుమార్, సర్వేయర్ లక్ష్మినారాయణ, వీఆర్వో దిలీప్, టీడీపీ నాయకులు పాడి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆదేశించారు. పెట్లూ రులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్, సవరణలు, వివాదాలు తదితర సమస్యలపై రైతులు అర్జీలు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

- కోట మండలం మద్దాలిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో వివిధ సమస్యలపై 60 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. ఇంటి స్థలాల కోసం 26, ఇళ్ల కోసం 13, రేషన్ కార్డులు 2, పెన్షన్లు 12, అడంగల్ సవరణలు 3, భూసమస్యలపై 2, సాదా బైనామా 2 అర్జీలు ఉన్నాయని తెలిపారు.
- రాపూరు మండలం గిలకపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఇందులో సచివాలయ నిర్మాణం, శ్మశానవాటిక ఏర్పాటుతోపాటు భూ సమస్యలపై 14 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ లక్ష్మినారాయణ తెలిపారు.
- బాలాయపల్లి మండలం అలిమిలి, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామసభల్లో జాయింట్ కలెక్టర్ శుభమ్‌బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


దొరవారిసత్రం : అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి